Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143




Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 256 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :256 | శనివారం 13 సెప్టెంబర్ 2025 | వెల : 3 | పేజీలు : 4

## 13 నుంచి 15 వరకు ప్రధాని ఐదు రాష్ట్రాల పర్యటన

- మిజోరం, అస్సాం పశ్చిమబెంగాల్ బీహార్ రాష్ట్రాలు ఉన్నాయి
- ఈ పర్యటనల్లో భాగంగా ప్రధాని మొత్తం రూ.71,850 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- కోల్‌కతాలో 16వ 'కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్-2025' ని ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు.
- మణిపూర్‌లోని చురాచంద్‌పూర్‌లో రూ.7,300 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



## భారత ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం

- ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ప్రముఖులు
- ఇటీవలి ఎన్నికల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై గెలుపు
- మహారాష్ట్ర గవర్నర్ పదవికి నిన్ననే రాజీనామా
- ఆర్ఎస్ఎస్ నేపథ్యం నుంచి కీలక పదవికి ఎంపిక



## అసత్య ప్రచారాలు కొనసాగితే..

# 11 సీట్లు కూడా మిగలవు



- హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత
- బెంగుళూరులో ఫుల్ టైమ్ ఉంటూ.. ఏపీకి పార్ట్ టైమ్ వస్తున్న జగన్.. అక్కడి నుంచి బురద తెచ్చి ప్రభుత్వంపై చల్లుతున్నారు
- వైద్య కళాశాలల పీపీపీ మోడల్ నిర్మాణంపై ప్రజల్ని భయపెట్టే యత్నం చేస్తున్నారు.
- కళాశాలల నిర్మాణాలు లేకుండా ఆహా అనేలా 17 వైద్య కళాశాలలు కట్టేశామని చెప్పుకోవడం మాజీ సీఎం జగన్‌కే చెల్లింది
- 17 వైద్య కళాశాలలు నిర్మించానని చెప్తున్న జగన్ వాటి క్షేత్రస్థాయి పర్యటనకు రాగలరా..?



## సెప్టెంబర్ 15 నుంచి రుతుపవనాల తిరోగమనం

- సాధారణంగా జూన్ ఒకటో తేదీన కేరళలో నైరుతీ రుతుపవనాలు ఎంటర్ అవుతాయి
- ఆ తర్వాత జూలై 8వ తేదీ వరకు దేశవ్యాప్తంగా వర్షాలు నమోదు అవుతాయి.
- ఈ ఏడాది పశ్చిమ రాజస్థాన్ నుంచి రుతుపవనాలు సెప్టెంబర్ 15వ తేదీ నుంచే తిరోగమనం చెందనున్నట్లు ఐఎండీ ఒక ప్రకటన

# అమరావతి అనేది నిరంతర అభివృద్ధి

- అమరావతి రైతులకు అన్యాయం జరగనివ్వను
- హైదరాబాద్ తరహాలో అమరావతి కూడా మహానగరంగా మారుతుంది
- గుంటూరు-విజయవాడ-తెనాలి-గ్రామాలు కలిస్తేనే అమరావతి మహానగరం
- భారత ప్రధానిగా నాలుగోసారీ నరేంద్రమోదీనే: సీఎం చంద్రబాబు
- మెడికల్ కాలేజీలు కట్టకుండా... కట్టేశామని చెబుతున్నారు
- మేం ప్రైవేట్ వారికి అప్పజెప్పడం లేదు...
- పీపీపీ పద్ధతినే నిర్మాణం చేపడుతున్నాం...
- ఏ ఒక్కరికీ అన్యాయం జరగదు... నిర్వహణ ప్రభుత్వానిదే.
- ఓ ప్రైవేట్ కాంక్లేవ్‌లో సీఎం చంద్రబాబు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాజధాని అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం జరగనివ్వనని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. శుక్రవారం విజయవాడ శివారులోని ఒక కన్వెన్షన్ హాల్‌లో వే2న్యూస్ సంస్థ నిర్వహించిన కాంక్లేవ్‌లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. అమరావతిలో మొత్తం ప్రైవేట్ భూములే. హైటెక్ సిటి రాకముందు హైదరాబాద్ ఎకరం రూ.లక్ష ఉండేది.. ఇప్పుడు రూ.100 కోట్లకు చేరింది. పరిశ్రమలు, అభివద్ధితో భూమి విలువ - మిగతా3లో

## యూరియా పుష్కలం..

# ఆందోళన వద్దు

- అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు
- ప్రస్తుతం యూరియా, డీఏపి, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు సహా అన్నిరకాల ఎరువులు సరిపడా నిల్వలుగా ఉన్నాయి
- రైతుల కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది
- ఒక్క రైతు కూడా ఇబ్బందులు పడకుండా చూడటమే లక్ష్యం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో ఎరువులు ఎటువంటి కొరత లేకుండా అందుబాటులో ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. విజయవాడలోని క్యాంప్ ఆఫీస్ లో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం యూరియా, డీఏపి, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు సహా అన్నిరకాల ఎరువులు సరిపడా నిల్వలుగా ఉన్నాయని తెలిపారు. జిల్లా వారీగా ఎరువుల నిల్వలను పరిశీలిస్తూ, కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులతో ప్రతిరోజూ సమీక్షలు జరుగుతున్నాయని అన్నారు. మార్కెట్‌లో ఎరువుల కొరత లేకుండా, రైతుల అవసరాలకు - మిగతా3లో



## భారత సైనికుల్ని కరిగించేందుకు చైనా ఆయుధాలు

- అమెరికా సెనెటర్ సంచలన వ్యాఖ్యలు
- ఐదు సంవత్సరాల క్రితం వివాదాస్పద సరిహద్దు వద్ద ఘర్షణపడ్డాయి
- అప్పుడు చైనా విద్యుదయస్కాంత ఆయుధాలను ఉపయోగించింది"
- "సుదీర్ఘకాలంగా చైనా, భారత్ మధ్య సంబంధాలు విశ్వాసలేమితో కొనసాగుతున్నాయి.

## భారత్‌ను చైనాకు దూరం చేయడమే మా ప్రాధాన్యం


- భారత్‌కు కాబోయే అమెరికా రాయబారి సెర్గీ గోర్ కీలక వ్యాఖ్యలు
- భారత్‌ను యూఎస్ వైపునకు తీసుకురావడం అత్యంత ముఖ్యమైన విషయమని
- తమ ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్ఎన్‌జీ కోసం భారత్ ప్రధాన మార్కెట్ కావాలి
- యూఎస్ మొత్తం జనాభా కంటే భారత్‌లో మధ్యతరగతి ప్రజలే ఎక్కువ
- ఆ దేశ మార్కెట్ అమెరికాకు అపారమైన అవకాశాలను అందిస్తుంది



## అమరావతి ఓఆర్ఆర్

# అడుగులు

- ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి దాదాపు రూ.25 వేల కోట్ల వ్యయం అంచనా.
- 190 కిలోమీటర్ల మేర ఆరు వరుసల రహదారి
- ఈ ప్రాజెక్టు పూర్తయితే రాజధాని అమరావతి ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి
- ఓఆర్ఆర్‌కు ఇరువైపులా రెండు వరుసల సర్వీస్ రోడ్లు కూడా..
- మొత్తం పది వరుసల నిర్మాణానికి ఈ అంచనాలు




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**


అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి దాదాపు రూ.25 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా. 190 కిలోమీటర్ల మేర ఆరు వరుసలుగా ఈ రహదారి ఉండనుంది. దీనికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు కూడా నిర్మించనున్నారు. ఈ ప్రతిపాదనలను కేంద్రానికి పంపగా, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాజధాని అమరావతి ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. ఓఆర్ఆర్‌కు దాదాపు రూ.25 వేల కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టు 190 కిలోమీటర్ల మేర ఆరు - మిగతా3లో

## సుప్రీంకోర్టులో సెల్ఫీలు, రీల్స్ ఇక కుదరదు



- హై సెక్యూర్టీ ఏరియాలో ఫోటోలు, వీడియోలు బ్యాన్
- ఒకవేళ ఎవరైనా ఈ నియమావళి ఉల్లంఘిస్తే, వారిపై కఠిన చర్యలు
- శుక్రవారం కోర్టు సెక్రటరీ జనరల్ ఈ సర్క్యూలర్ జారీ
- ఆ ఆదేశాలు లాయర్లు, ఫిర్యాదుదారులు, ఇంటర్న్‌లు, న్యాయ క్లర్క్‌లు, స్టాఫ్, విజిటర్స్‌కు వర్తించనున్నాయి
- కేవలం అధికార ప్రోగ్రామ్‌లకు మాత్రమే ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ అనుమతి

# ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కాలేజ్ ప్రారంభం







**గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:**
కుప్పంనియోజకవర్గం గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో యూని వర్శిటీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలను శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. శుక్రవారం ఉదయం ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్యయం. దొరస్వామి వర్శిటీలో ఇంజనీరింగ్ కళాశాల భవనాన్ని రిబ్బన్ కట్ చేసిప్రారంభించారు. అనంతరం ఇంజనీరింగ్ కళాశాల తరగతిగదులు, సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వర్శిటీ కందుకూరి వీరేశలింగం పంతులు ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభోత్సవ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ, వర్శిటీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇంజనీరింగ్ కళాశాలను ప్రారభించడం ఒక చరిత్ర అని కొనియాడారు. ఎన్టిఆర్ మానసపుత్రిక అయిన ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని అన్ని విధాలా ప్రక్షాళణ చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటున్నారన్నారు. వర్శిటీకి ఇచ్చిన హామీ మేరకు నేడు ఇంజనీరింగ్ కళశాలను రెండు కోర్సులతో ప్రారంభించి 120 సీట్లను కేటాయించడం జరిగిందన్నారు. రాబోయేకాలంలో వర్శిటీలో 2000 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు విద్యనభ్యసించేలా చూస్తామన్నారు. అదేవిధంగా వర్శిటీలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల సమస్యలను పరిష్కరించేం దుకు ప్రత్యేక చొరవ చూపామన్నారు. వర్శిటీ ప్రతిష్ట దెబ్బతీసే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే అలాంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చ రించారు. కొంత మంది పనిగట్టుకుని వర్శిటీ ఇంజనీరింగ్ కళాశాలలో




చేరితే భవిష్యత్తు ఉండదని విద్యార్థుల తల్లిదండ్రులకు చెబుతున్నట్లు సమాచారం వుందని, ఇలాంటివి ఇకన్నైనా మానుకోవాలని లేకుంటే తగిన రీతిలో వారికి బుద్ధి చెబుతామన్నారు. వర్శిటీ అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయ సహకా రాలు ఉంటాయని, వర్శిటీలోని బోధన, బోధనేతర సిబ్బంది.కలిసి కష్టపడి పనిచేసి వర్శిటీని అభివృద్ధి చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఏపిఎస్ ఆర్టీసీ వైస్- ఛైర్మన్ పి.ఎస్.మునిరత్నం మాట్లాడుతూ కుప్పం ఒకప్పుడు పనిష్‌మెంట్ ఏరియాగా పిలువబడేదని.. అయితే నేడు కుప్పం ప్రాంతంసర్వాంగసుందరంగా మారిందన్నారు. కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయూన్ని ఏర్పాటు చేయాలని స్వర్గీయ నందమూరి తారకరామారావు ప్రారంభిస్తే.. చంద్రబాబునాయుడు ఈ వర్శిటీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కుప్పం ప్రాంతా నికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు వుందని, దేశంలో ఎక్కడాలేని విధంగా ఇక్కడి ప్రజలు అనర్గళంగా తెలుగు, తమిళం, కన్నడ, ఆంగ్ల భాషలను మాట్లాడగలరన్నారు. ఇక్కడ విద్యనభ్యసించే వారు విద్య పూర్తయ్యేలోపు తెలుగు, తమిళం, కన్నడ భాషాలు నేర్చుకోవచ్చని అన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని వర్శిటీకి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కుప్పం, పలమనేరు, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిటీ ఛైర్మన్ డా.బి.ఆర్.సురేష్ బాబు మాట్లాడుతూ, ద్రవిడ వర్శిటీ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటగా చేరిన బ్యాచ్ విద్యార్థులకు ప్రత్యేకమైన గుర్తింపు వుంటుందన్నారు. ద్రావిడ వర్శిటీ ఆశయ సాధనకు, భాషల పరిరక్షణకు వర్శిటీ అధికారులు కృషి చేయాలని కోరారు. ద్రవిడ వర్శిటీ ఉపాధ్యక్షులు ఆచార్య ఎం.దొరస్వామి మాట్లాడుతూ... ద్రవిడ వర్శిటీ అభివృద్ధికి తాను ఉపపాధ్యక్షులుగా పదవి స్వీకరించినప్పటి నుంచి చేసిన అభివృద్ధిపనుల గురించి వివరించారు. వర్శిటీ అభివృద్ధికి ఆటంకం కలిగించే విధంగా కొందరు ప్రవర్తిస్తున్నారని అలాంటివి మానుకోవాలన్నారు. వర్శిటీలో అనేక సమస్యలను పరిష్కరించడా నికి కృషి చేశామని, ముఖ్యంగా ఔట్‌సో ర్సింగ్ ఉద్యోగుల జీతాలు చెల్లించడం, బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించగలిగామన్నారు. దీంతో పాటు వర్శిటీకి సిఎం హామీ మేరకు ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో రెస్కో ఛైర్మన్ ప్రతాప్, ఏఎంసీ ఛైర్మన్ రాజు, టిడిపి నాయకులు రాజ్‌కుమార్, డా.వెంకటేష్, బాబు, జనసేన నాయకులు నరేష్, బిజేపీ నాయకులు తులసీనాథ్, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసిఎన్ చారిటబుల్ ట్రస్ట్

### లయన్స్ క్లబ్ అఫ్ కుప్పం వారియర్స్ చే క్రీడా దుస్తులు వితరణ




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:**
చిత్తూరు జిల్లా జూనియర్స్ షూటింగ్ బాల్ బాలురు మరియు బాలికల జట్లకు 20 వేల విలువగల క్రీడా దుస్తులు బిసిఎన్ చారిటబుల్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ అఫ్ కుప్పం వారియర్స్‌చే వితరణ చేయడం జరిగింది. ఇటీవలే ఎంపికైన చిత్తూరు జిల్లా జూనియర్స్ షూటింగ్ బాల్ బాలురు మరియు బాలికలు, నెల్లూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారు. ఈ సందర్బంగా కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ వైస్ చైర్మన్ డా. సునీల్ రాజ్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే మా ఉందేశమని తెలిపారు. చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ చైర్మన్ మహేష్ మాట్లాడుతూ ఇలాంటి ప్రోత్సాహాలను క్రీడాకారులు అందిపుచ్చుకొని క్రీడలో బాగా రాణించాలని, అదేవిదంగా ఎల్లపుడు క్రీడాకారులకు సహాయం అందిస్తున్న డా. సునీల్ రాజ్ గారికి ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు, హెచ్ఓడి కోదండరాం, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మాధవన్, పిఆర్ఓ ప్రవీణ్, గంగాధర్, పిఈటిలు వేణు, జబీర్, స్వాతి, సంధ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి పై చైతన్యమే సమాజానికి రక్ష




**కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:**
హెచ్ఐవిపై సమాజంలోని అందరూ అవగాహన పెంచుకొని చైతన్యవంతు లైనప్పుడే సమాజానికి రక్షణ కలుగుతుందని పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధి కారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ప్రారంభమైన హెచ్ఐవి అవగాహన కార్యక్రమాలలో భాగంగా ఆరోగ్య సిబ్బంది మరియు కోర్ స్వచ్ఛంద సేవా సంస్థ వారు కలసి సంయుక్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య అధికారి మాట్లాడుతూ భావితరాలు హెచ్ఐవి బారిన పడకుండా రక్షించుకోవాలంటే హెచ్ఐవి గురించిన జ్ఞానాన్ని తెలుసుకోవడానికి ముందుకు రావాల్సిన అవసరముందన్నారు. హెచ్ ఐవి తల్లి నుంచి శిశువుకు, వ్యాధి సోకిన వ్యక్తితో కండోమ్ లేకుండా లైంగిక చర్యలో పాల్గొనడం ద్వారా,కలుషితమైన సూదులు లేదా సిరంజిలు పంచుకోవడంద్వారా, రక్తమార్పిడి ద్వారా వ్యాప్తి చెందుతుంద న్నారు. దీనిని నివారించడానికి గర్భం దాల్చిన వెంటనే తప్పనిసరిగా తల్లికి హెచ్ఐవి పరీక్ష చేయించాలని, లైంగిక చర్యలో కండోమ్ వాడటం మంచిదని, వాడిన సూది లేదా సిరంజీలు వేరొకరితో పంచుకోకూడదని, మాదకద్రవ్యాల అలవాటుకు దూరంగా ఉండాలని, నమోదిత రక్త కేంద్రాల నుంచి మాత్రమే సురక్షితమైన రక్తాన్ని స్వీకరించాలని సూచించారు. వ్యాధి సోకిన వ్యక్తులకు వివక్ష లేని వాతా వరణ కల్పించాలని, వారికి కూడా మన లాగే సమాన హక్కులు ఉంటాయని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ అపర్ణ, సిబ్బంది. శ్రీదేవి, వర సుబ్రమణ్యం, చంద్రయ్య, ప్రమీల, పురుషోత్తం, జయ ప్రకాష్, కోర్ స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది హసీనా సుభాషిణి, తులసి, శైలజ, రెడ్డి రాణి పాల్గొన్నారు.

## అంగన్ వాడి కేంద్రం అభివృద్ధికి సహకారం అందిస్తాం



**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:**
అంగన్‌వాడి కేంద్రం అభివృద్ధికి. అన్ని విధాల విధాల సహాయ సహకారాలు అందిస్తామని కల్లూరుకు చెందిన వ్యాపారవేత్త ఇమ్రాన్ అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం ఊడగ మాకులపల్లి. అంగనవాడి కేంద్రంలోని చిన్నారులకు వ్యాపారవేత్త ఇమ్రాన్. బాక్సులు.. పలకలు మ్యాట్స్., (చాపలు) ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం యువరాణి, అంగన్ వాడి కార్యకర్త శారద, పాల్గొన్నారు.

## రొంపిచర్ల ఏఎంసి కమిటీ సభ్యురాలుగా విజయ



**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:**
రొంపిచర్ల వ్యవసాయం మార్కెట్ సభ్యురాలిగా. విజయను..నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. పులిచెర్ల మండలం వంకాయల పాటి వారి పలికి చెందిన (వికేపల్లి) విజయ బిజెపి పార్టీలో చురుకుగా పాల్గొంటున్నారు. ఏఎంసి సభ్యురాలుగా విజయ నియమాకంపై బిజెపి జిల్లా కార్యదర్శి మాదాసు పార్థసారథి.. మండల బిజెపి అధ్యక్షురాలు మోబిన.. బిజెపి నాయకులు మాదాసు పార్థసారథి.. ఎర్రయ్య తదితరులు హర్షం తెలిపారు.

## ఎమ్మెల్యేను కలసిన పలమనేరు రూరల్ సీఐ



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12**
పలమనేరు రూరల్ (పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి) సీఐ బీ. పరశురాముడు పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేస్తోండిన మురళీ మోహన్ పలమనేరు అర్బన్ కు బదిలీపై రాగా బైరెడ్డిపల్లి మండల ఎస్ఐగా పని చేసిన ఈయన ప్రమోషన్ పై పలమనేరు రూరల్ సీఐగా బదలిపై వచ్చారు. దీంతో విధుల్లో చేరిన అనంతరం ఎమ్మెల్యేను స్థానిక కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఏఎంసీ చైర్మన్ ఆలకుప్పం రాజన్న, బైరెడ్డిపల్లి మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ్, నాయకులు రఘు చంద్ర గుప్తా, గిరిధర్ గోపాల్ తదితరులున్నారు.

## వర్క్ ఫ్రం హోం ద్వారా ఇంటి నుండే ఉపాధి పొందే అవకాశం:ఎంపీడీవో




**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12 :**
కుప్పంనియోజకవర్గ శాంతిపురం మండలంలోని మఠం గ్రామ పంచాయతీలో జరుగుతున్న వర్క్‌ఫ్రం హోం (కౌసల్యం) సర్వే నమోదు ప్రక్రియను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భముగా ఎంపీడీవో ఏపీఆర్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మండలము నందు సుమారు 4350 మంది వర్క్ ఫ్రం హోం (కౌసల్యం) నందు ఇంటివద్దనే పని చేసుకునుటకు నమోదు చేసుకున్నారని వీరంత 10వతరగతి అపై విద్యార్హత కలిగివున్నారని, ఇందులో 2759 మంది వారి ధృవపత్రములు సమర్పించారని మిగిలిన 1591 మంది మీకు సంభంధిన సచివాలయ సిబ్బందికి ధృవపత్రములు వెంటనే సమర్పించాలని ఎంపీడీవో తెలి పారు. ఇంకనూ ఎవరైనా నూతన నమోదు కొరకు ఆసక్తి వున్నవారు ధృవపత్రములను సచివాలయ సిబ్బందికి సెప్టెంబర్ 15 వ తేది లోపు సమర్పించి, నమోదు చేసుకోవాలని కోరారు. ఈ వర్క్ ఫ్రం హోం (కౌసల్యం) ద్వారా నిరుద్యోగ యువతి, యువకులు తమ ఇంటి వద్దనే అర్హత కలిగిన పనిని ఎంపిక చేసుకుని ఆర్థిక అభివృద్ధి పెంపొందించుకోవాలని, ఈ అవకాశమును అందరూ సద్వినియో గము చేసుకోవాలని, ఎవరైతే బయటికి వెళ్ళి ఉద్యోగాలు చేస్తున్న వారుకూడా ఈ అవకాశమును సద్వినియోగము చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు మురళి, జయపాల్, పంచాయతీ కార్యదర్శి గౌస్ బాషా,సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దళితవీర్ అవార్డ్ అందుకున్న నత్తం హరిబాబు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:**
శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు దళిత బహుజన ఫ్రంట్ రాయలసీమ కో ఆర్డినేటర్ నత్తం హరిబాబు శుక్రవారం గుంటూరులో దళితవీర్ అవార్డ్ అందుకున్నారు. బాబాసాహెబ్ డా.బి.ఆర్.అంబేద్కర్ భావజాలంతో దళిత జాతి జనులకు అండగా అందుబాటులో వుంటూ మానవ హక్కుల పరిరక్షణకు అంకితభావంతో విశేష కృషి చేస్తునందుకు చుందూరు దళిత పల్లెవీరుడు కొమ్మెర్ల అనిల్ కుమార్ స్ఫూర్తితో దళితవీర్ అవార్డ్ 2025 ను సెప్టెంబరు 10వ తేదీన గుంటూరులోని బ్రాడిపేట సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. దళిత పల్లెవీరుల మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ మరియు మాజీ మంత్రి డొక్కామాణిక్య వరప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి మేళం భాగ్యారావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు భూపతి సునీల్ కుమార్, డిపిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి, వివిధ సంఘాలకు చెందిన పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం తలపా దామోదరం రెడ్డి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:**
శ్రీకాళహస్తితొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాలెం నందుగల ఫౌండేషన్ స్కూల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేయు కయ్యురు బాలసుబ్రమణ్యం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇచ్చిన నేపథ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించడంజరిగినది. ఈ సందర్భంగా తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ బాల సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులు గానే కాక కవిగా, రచయితగా, మిమిక్రీ కళాకారులుగా,విద్యార్థులకు చేరువై సరళీకృతమైనటువంటి పద్ధతిలో విద్యను అందించడంలో వారు ఎనలేని కృషి చేస్తున్నారని వారిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, బాలాజీ, అరుణ్, మహేష్, చిరంజీవి, అల్లావుద్దీన్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహ రహిత ప్రపంచాన్ని నిర్మించడం మన బాధ్యత ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:**
శ్రీకాళహస్తి ప్రపంచవ్యాప్తంగా బాల్య వివాహాలను నివారించాలని జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ ఈ నెల 12 నుండి 14వ తారీకు వరకు గ్లోబల్ ఇంటర్ ఫెయిత్ ప్లెడ్జ్ వీకెండ్ కార్యక్రమాన్ని 100 దేశాలలో ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేవాలయాలు, చర్చిలు, మసీదులలో మత గురువులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేపించడమైనది. యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్ట్‌లో భాగస్తులైన ప్రగతి సంస్థ శ్రీకాళహస్తిలో శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో పురోహితులు, ఆలయ సిబ్బంది, వివిధ సంఘాల పెద్దలతో, పెద్ద మసీదులోని ఖాజీ, ఇమామ్, ముస్లిం సోదరులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేపించడం జరిగింది. ఈ కార్యక్ర మాన్ని ఉద్దేశించి ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ మాట్లాడుతూ సమాజంలో బాల్య వివాహాలను నివారించడానికి గత సంవ త్సరం ప్రభుత్వంతో కలిసి దేశవ్యాప్తంగా చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపైన్ ద్వారా దేశ వ్యాప్తంగా మొత్తం73,501 బాల్యవివాహాలు ఆపి నాలుగు కోట్ల 90 లక్షల మంది చేత బాల్యవివాహానికి వ్యతిరేకంగాప్రతిజ్ఞ చేపించడం జరిగింది. దేవాలయాల్లో పురో హితులు, ఆలయ సిబ్బంది, మసీదులో ముస్లిం మత పెద్దలు ఈ కార్యక్రమానికి ఎంతగానో సహకరించి బాల్య వివాహాలకు సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసిన కఠినంగా ఖండిస్తామని ఈ కార్యక్రమం ద్వారా వారు తెలియజేయడం చాలా సంతోష్కర విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు సాంబ రషీద్, ఎస్ లాలు యాంటీ కరప్షన్ డిస్టిక్ ప్రెసిడెంట్, ప్రభుత్వ ఖాజీ బహువుద్దీన్ షరీఫ్, ఆలయ అర్చకులు ఆనంద స్వామి, రామస్వామి, జయ స్వామి, దేవాలయ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, ఏఈఓ విద్యాసాగర్, మోహన్, సుబ్బయ్య గిరిజన రాష్ట్ర సలహాదారుడు, వజ్రం కిషోర్ టౌన్ కౌన్సిలర్, మాధవ మహేష్ టౌన్ కన్వీనర్, ప్రగతి సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రాజారెడ్డి, కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ చందమామల కోటయ్య, లత, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి అనేది నిరంతర అభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

పెరుగుతుంది. అమరావతి అభివద్ధి అనేది కంటిన్యూగా ఉంటుంది. అభివద్ధిని కొంత మేరకే పరిమితం చేస్తే... అమరావతి ఓ చిన్న మున్సిపాల్టీగా మిగిలిపోతుంది. హైదరాబాద్ తరహాలో అమరావతి కూడా మహానగరంగా మారుతుంది. గుంటూరు -విజయవాడ - తెనాలి -గ్రామాలు కలిస్తేనే మహానగరంగా మారుతుంది. భూములిచ్చిన వారిని ఆదుకుంటాం... విస్తరణ విషయంలోనూ ఏ మాత్రం ఇబ్బంది లేకుండా అభివద్ధి చేస్తాం. ఇప్పుడు ఉండే భూమి ఇప్పటికే సరిపోతుంది.. అవసరమైన మేరకు రైతులతో మాట్లాడి అమరావతిని అభివద్ధి చేస్తాం. క్వాంటం వ్యాలీకి శ్రీకారం చుట్టాం... క్వాంటం కంప్యూటింగ్ కు అవసరమైన అనుబంధ సంస్థలు పెట్టడానికి పలు సంస్థలు ముందుకు వచ్చాయి. అలాగే జాతీయ, అంతర్జాతీయ ప్రముఖ విద్యా సంస్థలు కొన్ని ఉన్నాయి... ఇంకొన్ని రాబోతున్నాయి. ఒకప్పుడు రాయలసీమలో 10 ఏళ్లల్లో 8 ఏళ్లు కరవు ఉండేది. ట్యాంకర్లల్లో నీళ్లు తీసుకెళ్లాల్సిన పరిస్థితి రాయలసీమలో ఉండేది. దేశంలో ఇప్పటికీ అతి తక్కువ వర్షపాతం ఉన్న జిల్లా అనంతపురం... కానీ నీళ్లను ఇవ్వడంతో అక్కడ పరిస్థితి మారింది. కోస్తా జిల్లాల కంటే అనంతపురం జిల్లానే జీఎస్డీపీలో టాప్ పొజిషన్లో ఉంది. హార్టికల్చర్ సాగు వల్లే ఇది సాధ్యం. నీళ్లు లేకపోయినా ఫర్వాలేదు.. రోడ్లు లేకపోయినా ఫర్వాలేదంటే... మనం ఇక్కడే ఉంటాం. పైగా వధా జలాలను మాత్రమే బనకచర్లకు వినియోగించుకుంటామని చెబుతున్నాం. పెద్ద పెద్ద సంస్థలన్నీ సొంత డబ్బులతో పెడుతున్నారా...? బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చుకుంటున్నారు... పెట్టుబడులు పెడుతున్నారు. ప్రభుత్వం కూడా అదే తరహాలో ప్రాజెక్టులు చేపడుతోంది. చిన్న చిన్న విషయాల్లో ఆలోచనలతోనే ఆపేస్తే ఇక్కడితోనే ఆగిపోతాం. ఇంజనీరింగ్ కాలేజీల విషయంలో నాడు నేను తీసుకున్న నిర్ణయాల వల్లే రైతు కూలీల పిల్లలు సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు అయ్యారు. మెడికల్ కాలేజీలు కట్టకుండా... కట్టేశామని చెబుతున్నారు. మేం ప్రైవేట్ వారికి అప్పజెప్పడం లేదు... పీపీపీ పద్ధతినే నిర్మాణం చేపడుతున్నాం... ఏ ఒక్కరికీ అన్యాయం జరగదు... నిర్వహణ ప్రభుత్వానిదే. వైద్య



విద్యార్థులకు, వైద్య సేవలకు ఇబ్బంది రాకుండా చేసే బాధ్యత మా ప్రభుత్వానిది. ఏదో బెదిరింపులు చేస్తే బెదిరిపోయే పరిస్థితి రాదని సీఎం వెల్లడించారు.

**భారత ప్రధానిగా నాలుగోసారీ నరేంద్రమోదీనే: సీఎం చంద్రబాబు**

భారతదేశానికి నాలుగోసారీ ప్రధానిగా నరేంద్రమోదీనే ఉంటారని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. వచ్చే దశాబ్దంలో ఏపీతోపాటు, దేశంలో అద్భుతాలు జరుగుతాయని ఆయన అన్నారు. ఒక సీఎంగా భావితరాల కోసం ఆలోచన చేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిలో నిర్వహించిన ఓ ప్రైవేట్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు.

వచ్చే దశాబ్ద కాలంలో ఏపీ రూపురేఖలు ఎలా ఉండబోతున్నాయనే అంశాన్ని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. '1994లో చాలా కఠిన నిర్ణయాలు తీసుకున్నా. 1999లో గెలిచా. 1999 ప్రభుత్వం వచ్చాక ఓ తపనతో పని చేశా. కొంచెం బ్యాలెన్స్ చేయలేకపోయాం. కానీ ఇప్పుడు పూర్తి బ్యాలెన్స్ చేస్తున్నాం. సంపద సృష్టిస్తున్నాం.. పేదలకు అందిస్తున్నాం. భారత ప్రధానిగా నాలుగోసారి కూడా మోదీనే వస్తారు. రాష్ట్రంలో కూడా ఎన్డీఏ ప్రభుత్వమే వస్తుంది. ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు' అని చంద్రబాబు తేల్చి చెప్పారు.

ఏపీలోని స్టేక్ హోల్డర్లను భాగస్వాములను చేస్తూ ఈ తరహా కాంక్లేవ్ నిర్వహించడం మంచి పరిణామం అని సీఎం చంద్రబాబు అన్నారు. విజన్ రూపకల్పన చేయడమే కాదు.. దాన్ని సాధ్యం చేసే దిశగా పని చేయాలని ఆయన సూచించారు. జాతీయ స్థాయిలో వికసిత్ భారత్-2047, రాష్ట్ర స్థాయిలో స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్లను సిద్ధం చేశామని తెలిపారు. '20-25 ఏళ్ల క్రితం భారతీయులకు సరైన గుర్తింపు లేని సమయంలో తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి భారతదేశం అభివృద్ధి అన్ స్టాపబుల్ గా మారింది. 2038 నాటికి భారతదేశం నెంబర్-1 అవుతుంది. ఇందులో తెలుగు వారి పాత్ర ప్రధానంగా ఉండాలని భావిస్తున్నా' అని చంద్రబాబు వెల్లడించారు.

ఏ ఏడాదికి ఆ ఏడాది ప్రణాళికలు రూపొందించుకున్నామని తెలిపిన చంద్రబాబు.. ఈ సంవత్సరం డబుల్ డిజిట్ గ్రోత్ సాధించగలిగామని చెప్పారు. '2028-29 నాటికి రూ.29,29,402 కోట్ల మేర జీఎస్డీపీ సాధించగలం.. 2029-2034 నాటికి రూ.57,21,610 కోట్ల జీఎస్డీపీ సాధించేలా ప్రణాళికలు ఉన్నాయి. దీన్ని సాధించే బాధ్యత ఎన్డీఏ కూటమి తీసుకుంటుంది' అని చంద్రబాబు స్పష్టం చేశారు.

2028-29 నాటికి తలసరి ఆదాయాన్ని రూ.5,42,985కి సాధిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. '2029-2034 నాటికి తలసరి ఆదాయం రూ. 10,55,000కి సాధించగలం. ఇదేమీ అసాధ్యం కాదు.. నిర్దిష్టమైన ఆలోచనతోనే ప్రణాళికలు వేశాం. మెగా డ్రీమ్స్ ఉండాలి.. సంకల్పం ఉండాలి.. అప్పుడు సాధ్యమే' అని చంద్రబాబు అన్నారు. విజన్-2020 డాక్యుమెంట్ సాకారమయ్యాక కూడా విజన్ డాక్యుమెంట్లపై ఇంకా అనుమానాలు సరికాదని చంద్రబాబు అన్నారు.' భారత్ లాంటి దేశాల్లో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాంతరంగా చేయాల్సిన అవసరం ఉంటుంది. 'సూపర్ సిక్స్ ద్వారా సంక్షేమం చేస్తున్నాం.. అభివృద్ధికి అదే తరహాలో నిధులిస్తున్నాం. రాజకీయాలు ముఖ్యమే కానీ.. సమాజం గురించి కూడా ఆలోచించాలి. రాజకీయాలే ఆలోచించి ఉంటే హైదరాబాద్ అభివృద్ధి జరిగేది కాదు.. విద్యుత్ సంస్కరణలు వచ్చేవి కావు' అని చంద్రబాబు అన్నారు.

## అసత్య ప్రచారాలు కొనసాగితే.. 11 సీట్లు కూడా మిగలవు...

**అమరావతి:** లండన్ మందులు వేసుకోకుండా మెడికల్ కళాశాలల గురించి మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. బెంగుళూరులో ఫుల్ టైమ్ ఉంటూ.. ఏపీకి పార్ట్ టైమ్ వస్తున్న జగన్.. అక్కడి



నుంచి బురద తెచ్చి ప్రభుత్వంపై చల్లుతున్నారని ఆరోపించారు. వైద్య కళాశాలల పీపీపీ మోడల్ నిర్మాణంపై ప్రజల్ని భయపెట్టే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు హోమ్ మంత్రి ఇవాళ (శుక్రవారం) మీడియాతో మాట్లాడారు.

ఏపీలో కళాశాలల నిర్మాణాలు లేకుండా ఆహా అనేలా 17 వైద్య కళాశాలలు కట్టేశామని చెప్పుకోవడం మాజీ సీఎం జగన్‌కే చెల్లిందని హోమ్ మంత్రి అనిత మండిపడ్డారు. 17 వైద్య కళాశాలలు నిర్మించానని చెప్తున్న జగన్ వాటి క్షేత్రస్థాయి పర్యటనకు రాగలరా..? అని ప్రశ్నించారు. జగన్ కళాశాలలు కట్టానని చూపించేందుకు సిద్ధమైతే పోలీసు భద్రతతో తానే ఆయన్ను అక్కడికి తీసుకెళ్తానని వివరించారు. ఈ నేపథ్యంలో జగన్ ఆహా అనేలా నిర్మించిన వైద్య కళాశాలల్ని ప్రజలు చూడాలంటూ.. వైద్య కళాశాలల నిర్మాణ స్థితిగతులపై ఆమె వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు.

మొండి గోడల నుంచి ఇంటికో వైద్యుడిని తీసుకోస్తానని చెప్తున్న జగన్‌ను ఏమనాలని హోమ్ మంత్రి అనిత విమర్శించారు. తాను దేనినైనా మసిపూసి మారేడుకాయ చేయగలనని జగనే చెప్పుకుని అడ్డంగా దొరికిపోయారని పేర్కొన్నారు. పీపీపీ మోడల్‌ని జగన్ ప్రైవేటు పార్టనర్ షిప్ (జేపీపీ)గా భావిస్తున్నాడేమో అని అనుమానం వ్యక్తం చేశారు. పీపీపీ మోడల్ వల్ల ఏ ఒక్క సీటు కూడా పేదలకు తగ్గదని తేల్చి చెప్పారు. తొందరగా కళాశాలల నిర్మాణం జరిగి ప్రజలకు అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో నిబంధనల ప్రకారం ఉన్న పీపీపీ విధానాన్ని ఎంచుకున్నామని ఆమె స్పష్టం చేశారు. జగన్ చేసిన పాపాలకు కొత్త అడ్మిషన్లు కూడా ఇంతవరకు రాలేదని ఆరోపించారు. వైద్య విద్యను సామాన్యులకు ఎంత మేర దూరం చేయాలో అంతమేర జగన్ దూరం చేశారని అనిత మండిపడ్డారు. సామాన్యులకు మెరుగైన వైద్య విద్య అందించాలనే కూటమి ప్రభుత్వ తపనను రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీలా నల్ల నోటుకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీ తెలుగుదేశం కాదని ధీమా వ్యక్తం చేశారు. అసత్యాలు చెప్పినందుకే ప్రతిపక్ష హోదా కూడా లేకుండా 11 సీట్లకు ప్రజలు సరిపెట్టారని గుర్తు చేశారు. ఇవే అసత్యాలు కొనసాగితే ఆ 11 కూడా మిగలవని హెచ్చరించారు. పగటి కలలు కంటూ.. మేకపోతు గాంభీర్యంతో మళ్లీ అధికారంలోకి వస్తానని జగన్ చెప్తున్నారని హోమ్ మంత్రి అనిత ధ్వజమెత్తారు.

## యూరియా పుష్కలం.. ఆందోళన వద్దు..

-మొదటిపేజీ తరువాయి

అనుగుణంగా సరఫరాలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. రైతుల కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, ఒక్క రైతు కూడా ఇబ్బందులు పడకుండా చూడటమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివద్ధి చెందుతుంది. అందుకే రైతుల సమస్యల పరిష్కారం మా మొదటి కర్తవ్యం అని మంత్రి స్పష్టం చేశారు. ఎరువుల కొరత పేరుతో రైతులను మోసం చేయాలనుకునే డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించేలా జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులు 24 గంటలు పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని సహకార సంస్థలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ వ్యాపారుల వద్ద 82,054 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. వివిధ పోర్టుల నుండి మరియు తయారీ సంస్థల నుండి 29,236, మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలకు రవాణా దశలో ఉందన్నారు. 1,06,412 మెట్రిక్ టన్నుల యూరియా పలు పోర్టులు, తయారీ సంస్థల ద్వారా రాష్ట్రానికి సెప్టెంబర్ నెలాఖరకు చేరుకుంటాయని అన్నారు. రైతుల అవసరాలను గుర్తించిన కేంద్రం గురువారం రాష్ట్రానికి మరో 24,894 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించారని, ఈనెల 15 తేదీ నుండి 22వ తేదీ లోపు విశాఖపట్నం పోర్టుకు యూరియా చేరుకుంటుందని తెలిపారు. ఈ యూరియా నిల్వలతో కరీఫ్ సీజన్ కు సరిపడా యూరియా అందరికి లభిస్తుందని, రాష్ట్రంలో ఎక్కడా కూడా యూరయా కొరత అనే మాట వినిపించదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు చొరవ ఫలితమే ఈ కేటాయింపు అని అన్నారు.

## అమరావతి ఓఆర్ఆర్ అడుగులు

-మొదటిపేజీ తరువాయి

వరుసలుగా ఉంటుంది. ఓఆర్ఆర్‌కు ఇరువైపులా రెండు వరుసల సర్వీస్ రోడ్లు కూడా ఉంటాయి. మొత్తం పది వరుసల నిర్మాణానికి ఈ అంచనాలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలను అధికారులు కేంద్రానికి పంపారు. గతంలో ఈ ప్రాజెక్టుకు 70 మీటర్ల వెడల్పుతో భూమిని సేకరించారు. అప్పుడు దీని



నిర్మాణానికి రూ.16,310 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇప్పుడు 140 మీటర్ల వెడల్పుతో భూమిని సేకరించాల్సి ఉంది. ఇప్పుడు ప్రాజెక్టు వ్యయం రూ.25 వేల కోట్లకు చేరుతుందని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో భూసేకరణ భారం కాకుండా ఉండేందుకు ఆయన కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు.ఈ ప్రతిపాదనలను కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ లోని ప్రాజెక్ట్ అప్రైజల్ టెక్నికల్ స్క్రూటినీ కమిటీకి పంపారు. మోర్త్ ఆమోదం తెలిపితే ఆ ఫైల్(ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య అప్రైజల్ కమిటీ) దగ్గరకు వెళుతుంది. ఆ తర్వాత సెంట్రల్ కేబినెట్ కమిటీ ఆఫ్ ఎకనమిక్ ఎఫైర్స్ ఈ ప్రాజెక్టు బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుంది. ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేస్తే అమరావతి ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు. వాస్తవానికి ఓఆర్ఆర్ నిర్మాణానికి మోర్త్ ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ మొదట 70 మీటర్ల వెడల్పుతో అనుమతి ఇచ్చింది. దీనికి సివిల్ పనుల కోసం రూ.12,995 కోట్లు అవుతుందని అంచనా వేశారు. అలాగే 1,702 హెక్టార్ల భూమిని సేకరించేందుకు రూ.2,665 కోట్లు, 124 హెక్టార్ల అటవీ భూమికి రూ.150 కోట్లు, పర్యావరణ అనుమతులకు రూ.200 కోట్లు, ఇతర ఖర్చుల కోసం రూ.300 కోట్లు కేటాయించారు. మొత్తంగా రూ.16,310 కోట్లకు ఆమోదం తెలిపారు. రింగ్ రోడ్డు లోపలి వైపు మాత్రమే సర్వీస్ రోడ్డు నిర్మించాలని కమిటీ పేర్కొంది.ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి భవిష్యత్తులో ఓఆర్ఆర్‌ను విస్తరించాల్సి వస్తే భూసేకరణ ఖర్చు పెరుగుతుందన్నారు. అందుకే ఇప్పుడే 150 మీటర్ల వెడల్పుతో భూసేకరణ చేయాలని కేంద్రాన్ని కోరారు. రింగ్ రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు ఉండాలని కేంద్రానికి లేఖ రాశారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి గడ్కరీతో చంద్రబాబు స్వయంగా మాట్లాడారు. సీఎం చంద్రబాబు విజ్ఞప్తికి గడ్కరీ సానుకూలంగా స్పందించారు. 140 మీటర్ల వెడల్పుతో భూసేకరణకు, ఓఆర్ఆర్‌కు ఇరువైపులా సర్వీస్ రోడ్ల నిర్మాణానికి ఆయన అంగీకరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 140 మీటర్ల వెడల్పుతో ఓఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతి లభించింది.రాష్ట్ర ప్రభుత్వం కూడా తనవంతుగా సహకారంగా నిర్మాణంలో ఉపయోగించే వస్తువులపై జీఎస్టీ 9 శాతం మినహాయించింది. మట్టి, కంకర, గ్రావెల్ వంటి వాటిపై సీనరేజ్ ఫీజును పూర్తిగా రద్దు చేశారు. ప్రభుత్వం దాదాపు రూ.2 వేల కోట్లు భరించనుంది. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.25 వేల కోట్లకు చేరగా.. అందులో భూసేకరణకు రూ.5,600 కోట్లు అవుతుంది.. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు భరిస్తుంది.అమరాతి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు భూసేకరణకు సంబంధించి ఏ భూములు కావాలో గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లా కలెక్టర్లకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వివరాలు అందజేశారు. ఆ ప్రతిపాదనల్ని పరిశీలించి కలెక్టర్లు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. కొన్ని జిల్లాల నుంచి ఇప్పటికే వివరాలు అందజేయగా.. మరికొన్ని జిల్లాలవారు అందజేయాల్సి ఉంది.. మరో రెండు వారాల్లో వివరాలు వస్తాయంటున్నారు.

# తురకపాలెం మరణాలపై కొనసాగుతున్న మిస్టరీ

**గుంటూరు :** గుంటూరు జిల్లా తురకపాలెంలో వరుస మరణాలు సంచలనంగా మారాయి. అధికారులను పరుగులు పెట్టించిన ఘటను అసలు కారణం ఏంటనేది ఇంత వరకు వెలుగులోకి రాలేదు. ఎన్ని రకాల పరీక్షలు చేస్తున్నా ప్రయోజనం లేదు. దీంతో స్థానికంగా ఉన్న ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఢిల్లీ నుంచి వచ్చిన జాతీయ వ్యాధి నియంత్రణ బృందం అక్కడ మరికొన్ని పరీక్షలు చేస్తోంది. 7అసలు విషయం గుర్తించే పనిలో ఉంది. ఓవైపు వైద్య పరీక్షలు కొసాగిస్తూనే మరోవైపు ఇతర కారణాలపై అధికారులు ఆరా తీశారు. ఈ క్రమంలోనే కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఈ మిసరీ మరణాల కేసు మరో మలుపు తిరిగేటట్టు కనిపిస్తోంది. ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష వైద్యం కారణంగానే ఇదంతా జరిగిందనే అనుమానాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన సెలైన్ వాడకం, మితి మీరిన డోస్‌లో మందులు ఇవ్వడంతో ఇలాంటి పరిస్థితి వచ్చిందా అన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. తురకపాలెంలో జ్వరం వచ్చిన తర్వాత చాలా మంది బాధితులు అనుమానిత ఆర్ఎంపీ వద్దే చికిత్స చేయించు కున్నారని తెలుస్తోంది. వారికి చికిత్స చేసే క్రమంలో కాలం చెల్లిన సెలైన్‌తోపాటు, మోతాదుకు మించిన యాంటీబయాటిక్స్ వాడినట్టు అధికారులు గుర్తించారు. ఈ చర్యల వల్ల బాధితులకు జ్వరాలు తగ్గకపోవడంతోపాటు ప్రాణాంతకంగా మారినట్టు భావిస్తున్నారు. పరిస్థితి చేయి దాటిపోయిన తర్వాత వాళ్లంతా వేర్వేరు ఆసుపత్రులను ఆశ్రయించారని తెలుస్తోంది.కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో మాట్లాడిన తర్వాత అధికారులు ఆర్ఎంపీ వైద్యంపై క్లారిటీకి వచ్చారు.



దీంతో ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌లో జిల్లా వైద్యాధి ఒకారులు తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో యాంటీబయోటిక్ మందులు గుర్తించారు. అనంతరం క్లినిక్‌ను సీజ్ చేశారు. ప్రస్తుతం అధికారుల అదుపులోనే ఆర్ఎంపీ ఉన్నారు. చేసిన వైద్యంపై ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి వైద్యం ఎవరు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు

**ఆర్ ఎంపీ క్లినిక్ సీజ్**

భయానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిన తురకపాలెంలో గ్రామంలోని ఓ ఆర్ఎంపీ నడుపుతోన్న క్లినిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి సీజ్ చేశారు. మృతుల్లో కొందరు ఆర్ఎంపీ వద్దే తొలుత చికిత్స పొందినట్లు గుర్తించారు. అధిక మోతాదులో యాంటీబయాటిక్స్‌ను బాధితులకు ఆర్ఎంపీ ఇచ్చినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అంతేకాదు, ఎక్కువగా సెలైన్ల వాడకం కూడా ఇన్‌ఫెక్షన్‌కు కారణమని భావిస్తున్న అధికారులు.. ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసినట్టు వెల్లడించారు. అయితే, ఈ స్థానికులు మాత్రం ఆ ఆర్ఎంపీ వైద్యంపై విశ్వాసం వ్యక్తం చేయడం గమనార్హం. గత పదేళ్లుగా అతడు తమకు వైద్యం చేస్తున్నాడని, ఎప్పుడూ ఏం కాలేదని చెబుతున్నారు. తమ పిల్లలకు జ్వరం వచ్చినా ఆయన దగ్గరకే వెళ్తామని, చుట్టుపక్కల పది గ్రామాల్లో అతడు వైద్యం చేస్తున్నాడని అంటున్నారు.దాదాపు మూడు వేల జనాభా ఉన్న పల్నాడు జిల్లా తురకపాలెం గ్రామంలో గత ఐదు నెలల్లోనే 28 మంది చనిపోయినట్టు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇటీవల వెల్లడించారు. జులై, ఆగస్టులోనే 20 మంది వరకు మరణించారు. పలువురు అతి ప్రమాదకరమైన 'మెలియాయిడోసిస్' అనే ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆరుగురిలో ఒకరికి 'మెలియాయిడోసిస్' పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. కానీ, మెలిన్ అనే బ్యాక్టీరియా వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతుండగా.. గ్రామస్థులకు స్వయంగా ప్రభుత్వమే ఆహారం, తాగునీరు అందజేస్తోంది. అటు, పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. వీధులు, పరిసరాలతో పాటు 68 నీటి ట్యాంకులను శుభ్రపరిచారు.మరోవైపు, తురకపాలెంలో పరిస్థితి అదుపులోకి వచ్చిందని జీజీహెచ్ వైద్యులు తెలిపారు. మెలియాయిడోసిస్ లక్షణాలతో ఆసుపత్రి చేరిన ఇద్దరు కోలుకోవటంతో వారిని డిశ్చార్జ్ చేశామని చెప్పారు. మరికొందరు అనుమానితుల నివేదికలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. అటు, ఎన్‌సీడీఏ ఆధ్వర్యంలోని వైద్య నిపుణుల బృందం కూడా గ్రామంలో పర్యటించి, గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసింది.

# కనిగిరికి ట్రైన్...



**ఒంగోలు :** ఏపీలోని ఆ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది.. అక్కడ కొత్త రైల్వే స్టేషన్ సిద్ధమైంది, తొలిసారి రైలు పరుగులు తీసింది. మొదటిసారిగా వచ్చిన రైలుకు స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు.. మరో మూడు నెలల్లో పూర్తిస్థాయిలో రైళ్లు తిరుగతాయనే ఆనందంలో ఉన్నారు. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలో ప్రజలకు నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ రైలు మార్గం ఎన్నో ఏళ్ల కలగా మిగిలింది.. అయితే ఎట్టకేలకు ఆ మార్గంలో పనులు వేగవంతం కావడంతో రైలు కూతలు వినిపిస్తున్నాయి. కనిగిరి వరకు రైలు పట్టాలు, స్టేషన్ల నిర్మాణ పనులు ముగింపు దశకు వచ్చాయి.తాజాగా ఛత్తీస్‌ఘడ్‌లోని బిలాస్‌పూర్ నుంచి ఓ గూడ్స్ రైలు కనిగిరి సమీపంలోని యడవల్లికి చేరుకుంది. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనుల కోసం ఈ రైలు వచ్చింది. దీంతో స్థానిక ప్రజలు ఆనందంలో ఉన్నారు.. ఆ రైలుకు స్వాగతం పలికారు. ఈ రైలు బిలాస్‌పూర్ నుంచి 30 పెట్టెలతో వచ్చింది. నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు కావలసిన ట్రాక్‌లు, ఇతర సామాగ్రిని ఈ రైలులో తీసుకొచ్చారు. ఈ రైలు మార్గంలో భూసేకరణ సమస్యలు తీరడం, క్వారీ సమస్య పరిష్కారం కావడంతో రైలు మార్గం త్వరలో అందుబాటులోకి రానుంది. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్‌లో స్థల సేకరణకు సంబంధించిన పరిహారం రూ.7 కోట్లు చెల్లించడంతో సమస్యలు పరిష్కారం అయయ్యాయి. రైల్వే లైన్ పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ మొదటి వారంలో కనిగిరికి రైళ్లు వస్తాయని తహసీల్దార్ రవిశంకర్ అంటున్నారు. దీంతో కనిగిరి ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది.కనిగిరి దగ్గరలోని శంకవరం దగ్గర ఈ రైలు మార్గంపై క్వారీ నిర్వాహకులు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో వంతెన నిర్మాణం ఆగిపోయింది. దీంతో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి క్వారీల నిర్వాహకులతో చర్చలు జరిపారు, వారితో సమస్యలపై మాట్లాడారు. సమస్యను పరిష్కరించడంతో వంతెన నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. యడవల్లి, పోలవరం రైలు నిలయాలతో పాటు వంతెనల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికి కనిగిరికి రైళ్లు వస్తాయని రైల్వేశాఖ అధికారులు కూడా చెబుతున్నారు.జిల్లాలోని దర్శి, పొదిలి వరకు రైల్వే మార్గం పనులు దాదాపుగా పూర్తయ్యాయి.. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. మిగిలిన పనుల్ని కూడా ఈ ఒకటి, రెండు నెలల్లో పూర్తి చేస్తామంటున్నారు అధికారులు. కనిగిరి వైపు పనులు జరుగుతున్నాయి.. యడవల్లి రైల్వే స్టేషన్‌కు సంబంధించిన పనులు ముగింపు దశకు వచ్చాయి. ఈ రైలు మార్గంలో నడికుడి నుంచి కనిగిరి వరకు దాదాపు 145 కిలో మీటర్ల మేర రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. యడవల్లి రైల్వే స్టేషన్‌లో టికెట్ కౌంటర్, అధికారుల గెస్ట్ హౌస్‌లు, సిగ్నల్ కార్యాలయం, ప్రయాణికులు కూర్చోడానికి బల్లలు, తాగునీటితో వంటి వసతుల పనులు జరుగుతున్నాయి. అటు పామూరు మండలం రావిగుంటపల్లి వరకు ట్రాక్ సిద్ధమైందని చెబుతున్నారు

## బోయకొండ గంగమ్మకు రాహుకాల అభిషేకం



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 12:** శక్తిస్వరూపిణి బోయకొండ గంగమ్మకు శుక్రవారం రాహుకాల అభిషేకాన్ని సాంప్ర దాయపద్ధంగా నిర్వహించారు. ఉదయా న్నే అమ్మవారికి ఆలయ అర్చకులు వేద పండితులు ఆధ్వర్యంలో విశేష అభిషేకము అలంకరణ చేశారు.అనంతరం దంపతుల సమక్షంలో అమ్మవారికి రాహు కాల సమయంలో అభిషేకంచేశారు. రాహుకాల సమయంలో దంపతులచే అభిషేకాలు చేస్తే లోకం సుభిక్షంగా ఉంటుందని భక్తుల నమ్మకందీంతో అభిషేకానికి విశేషస్పందన లభించింది, ఉచిత అన్నదాన శిబిరం ఆన వాయితీగా నిర్వహిస్తున్నారు. ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం భక్తులకు సేవలు అందించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో
## వివిధ పనులకు రూ 5లక్షల మంజూరు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:** చొరవ చూపిన టిడిపిమండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి,పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి మండలం స్థానికప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ పనులకు గాను ప్రభుత్వం నుంచి రూ 5 లక్షలు మంజూరు అయింది. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి పనులకు సంబంధించి చొరవ చూపడంతో కలెక్టర్ సుమిత్ కుమార్ మంజూరు చేశారు. కళాశాల చుట్టూ కంచ వేయడానికి రూ 2 లక్షలు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకంలో భాగంగా భవన నిర్మాణానికి రూ 2.4 లక్షలు అదే విధంగా ప్రధాన గేటు నిర్మాణానికి రూ 60 వేలు మంజూరైనట్లు ఎంపీడీవో లీలా మాధవి తెలిపారు. పనుల నిర్మాణం మంజూరులో చొరవ చూపిన గువ్వల రమేష్ రెడ్డిని కళాశాలతో పాటు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## మెడికల్ అసెస్మెంట క్యాంప్



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:** శ్రీకాళహస్తి ఆర్బిఏస్ జడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్నటువంటి మెడికల్ అసెస్మెంటక్యాంప్ శుక్రవారం క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపుకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మండలాలు ఏర్పేడు, తొట్టంబేడు, కె.వి.బి పురం, వరదయ్యపాలెం, బియన్ కండ్రిగకు సంబంధించి ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలందరూ 130మంది హాజరవడం జరిగింది.వారిని పరిశీలించి వారికి కావలసినటువంటి పరికరాలను నిర్ధారణ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో డి.ఈ.వో కె వి ఎన్ కుమార్, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీ శంకర్, ఐ ఈ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, సీఎంఓసురేష్, ఏటీఎం సుధాకర్ నాయుడు, ఏ ఎల్ ఎస్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ నాయుడు, సెక్టోరి యల్ అధికారి సారథి,బాయ్స్ హై స్కూల్ హెచ్ఎం వెంకటయ్య, ఎంఈఓ 1శ్రీకాళహ స్తి భువనేశ్వరి ఎంఈఓ 2శ్రీకాళహస్తి బాలయ్య, తొట్టంబేడు ఎంఈఓ 2 భాస్కర్, వైద్య నిర్ధారణ అధికారి ప్రియా, సహాయ సిబ్బంది ఐఆర్టీలు, సి.ఆర్.పిలు తదితరులు పాల్గొన్నారు.

## మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో
## ఉచిత మెగా వైద్య శిబిరం

**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12.** వీ.కోట మండలం వీకోట పట్టణం వైయస్సార్ సర్కిల్ కరీం కాంప్లెక్స్ ఎదురుగా సెప్టెంబర్ 14వ తేదీ ఆదివారం, బెంగళూరుకు చెందిన మణిపాల్ హాస్పిటల్ వారి సౌజన్యంతో మొట్ట మొదటిసారిగా వీకోటలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా మండలంలోని ప్రజానీకం, ఈ సదా అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాల్సిందిగా మణిపాల్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పత్రిక ముఖముగా తెలియ చేశారు.ఈ శిబిరంలో బిపి షుగర్ హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందు బిల్లలు మందులు ఉచితంగా పంపిణీ చేస్తారని తెలియచేశారు. ఈ కార్యక్రమానికి అన్ని రకాల వైద్యులు హాజరవుతారని తెలిపారు.

## నేపాల్ నుంచి సురక్షితంగా
## స్వస్థలాలకు తెలుగు ప్రజలు

### ప్రభుత్వ బాధ్యతను చాటి చెప్పిన నారా లోకేష్
### నేపాల్ ఘటనపై ప్రకటన విడుదల చేసిన పలమనేరు ఎమ్మెల్యే అమర్



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:** నేపాల్‌లో జరుగుతున్న మారణ హోమంలో తెలుగు ప్రజలు ఉన్నారని తెలియగానే క్షణం కూడా ఆలస్యం చేయకుండా మంత్రి నారా లోకేష్ స్పందించారని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి ప్రశంసించారు. నేపాల్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటన పై ఆయన స్పందిస్తూ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి ఎప్పుడు ఎక్కడ ఆపద వచ్చినా తెలుగుదేశం పార్టీ ముందు ఉంటుందన్న విషయం నేపాల్ ఘటనతో మరోసారి స్పష్టమైందని తెలిపారు. నేపాల్‌లో అల్లర్లు జరుగుతున్నాయన్న విషయం తెలియగానే లోకేష్ తన అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సహాయక చర్యలను వేగవంతం చేశారన్నారు. దీని ద్వారా బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పడమే గాక ఎక్కడెక్కడ ఉన్నారో లోకేషన్ కోఆర్డినేటర్లతో సహా మ్యాప్ సిద్ధం చేయించారన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అత్యవసర హెల్ప్ లైన్ ఏర్పాటు చేయించి, నేపాల్‌లో చిక్కుకుపోయిన ప్రజలకు ఆహారం, నీరు,వసతి సదుపాయాలు కల్పించేలా చూశారన్నారు. మానవీయ స్పందన తమ ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను లోకేష్ చాటి చెప్పారని తెలిపారు. కేంద్రంతో సమన్వయం చేసుకొని పక్కా వ్యూహంతో ఆపదలో ఉన్న ఒక్కొక్కరిని సురక్షితంగా రక్షించి 215 మందిని వారి స్వస్థలాలకు తరలించడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. గత జూన్ నెలలోనూ కంబోడియాలో మోసపూరిత ఉద్యోగ ఆఫర్లతో చిక్కుకున్న మీసాల ఆదిబాబు వంటి తెలుగు యువకులను లోకేష్ బాబు రక్షించడాన్ని గుర్తు చేశారు. ఇక నేపాల్ ఘటనపై జగన్ రెడ్డి కనీసం స్పందించకపోవడం మానవతా దృక్పథంతో కూడా వ్యవహరించలేదని ఆయన విమర్శించారు.

# హాస్టల్ భవనాల ఏర్పాటుకు స్థలాలను గుర్తించండి

## విద్యార్థులకు ఇబ్బందులు.. ప్రజలకు అసౌకర్యమైన స్థలాలు వద్దు
## అధికారులకు సూచించిన ఎమ్మెల్యే అమర్



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:** ప్రభుత్వం తరపున మంజూరైన ఎస్సీ కాలేజ్ బాయ్స్,ఎస్సీ కాలేజ్ గర్ల్స్ హాస్టళ్ళ ఏర్పాటుకు అనువైన స్థలాలను పలమనేరు పట్టణంలో వెంటనే గుర్తించాలని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ మేరకు స్థానిక కార్యాలయంలో శుక్రవారంఆయన హాస్టళ్ళ నిర్మాణ అంశంపై మున్సిపల్, రెవెన్యూ, విద్యాశాఖా అధికారులతో సమావేశమై చర్చించారు. పీఎం అజయ్ పథకంద్వారా రూ.3 కోట్లతో ఎస్సీ బాయ్స్ మరియు గర్ల్స్ కాలేజీల ఏర్పాటుకు ప్రభు త్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అయితే ఈ హాస్టల్ లో ఏర్పాటు విడివిడిగా నిర్మించాల్సి ఉండడంతో విద్యార్థులకు అనువైన స్థలాలను ఎంపిక చేయాల్సి ఉందన్నారు.అయితే కాలేజీ గర్ల్స్ హాస్టల్ ఏర్పాటుకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని స్థలాన్ని అధికారులు గుర్తించి ఎటువంటి ఇబ్బందులు లేకుంటే అక్కడే నిర్మించేలా చర్యలు తీసుకోవాల న్నారు. ఇక బాయ్స్ హాస్టల్ నిర్మాణానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీ పంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి విద్యార్థులకు అసౌకర్యం లేకుండా ఉండేలా జాగ్రత్త లు తీసుకోవాలన్నారు. ఇలా ఉండగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కాలేజ్ బాయ్స్ హాస్టల్ నిర్మాణాన్ని చేప ట్టాలని కొందరు సూచించారని అధికారులు ఆయనకు తెలియజేశారు. డిగ్రీ కళాశాల మైదానం ఎంతో మంది క్రీడాకారులకు, పట్టణ ప్రజ లకు ఉపయోగంగా ఉందని కాబట్టి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్త ని అదే విధంగా ప్రజలకు అసౌకర్యం లేని స్థలాన్ని గుర్తించి ఒకటి రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ ఇన్బనాథన్, మున్సిపల్ కమిషనర్ ఎన్.వి. రమణా రెడ్డి, డీఈ సురేష్, ఎఈ స్నేహ ప్రియా, టీపీ ఎస్ ఇందిరా, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ళు వెంకటేశ్వర్లు, కన్నయ్యలతో పాటు టీడీపీ నాయకులు ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజా, శ్రీధర్,బిఆర్సి కుమార్ తదితరులున్నారు.

## టిడిపి యువ నాయకుడు
## నిరంజన్ కుమార్ మృతి చాలా బాధాకరం
### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:** టిడిపి యువ నాయకుడు నిరంజన్ కుమార్ మృతి చాలా బాధాకరం అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. శుక్రవారం ఎస్ఆర్ పురం మండలం సింధూ రాజపుర గ్రామంలో నిరంజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. నిరంజన్ కుమార్ తల్లిదండ్రులను నిరంజన్ కుమార్ భార్యాబిడ్డలను ఓదార్చారు, నిరంజన్ కుమార్ మృతి చెందినా అతని అవయవాలు 7 మందికి ప్రాణదానంగా చేయడం ఎంతో గొప్ప విషయం. నిరంజన్ కుమార్ కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ పురం మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు రాజశేఖర్ నాయుడు టిడిపి యువ నాయకుడు హరీష్ యాదవ్, బాలాజీ నాయుడు, పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమ నాయుడు యాదవ సాధికారసమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ ఎస్ఆర్ పురం మండల సింగల్ విండో అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి కుమార్ మాజీ సర్పంచ్ కుప్పయ్య మండల నాగరాజు పైనేని మురళి, మండల యువత అధ్యక్షుడు చంద్రబాబు రెడ్డి, జీవన్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ మాజీ ఎంపీటీసీ వేమన నాయుడు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకటాచలం, పుల్లూరు బాబు, గజేంద్ర, బసిరెడ్డిపల్లి దొరస్వామి నాయుడు మైనారిటీ నాయకుడు ఖాదర్ బాషా, మధు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి నూతన ఏపిఎస్ ఆర్టీసీ
## డిపో డిఎంగా ఎం.రేవతి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:** శ్రీకాళహస్తి ఏపిఎస్ ఆర్టీసీ డిపో డిఎం మునిచంద్ర తిరుమల డిపో కి బదిలీ అయినారు. మదనపల్లి డిపో నుండి విచ్చేసిన నూతన డిఎం ఎం రేవతి బాధ్య తలు స్వీకరించారు.ఏపిఎస్ ఆర్టీసీ డిపో కార్యాలయ ఉద్యోగ సిబ్బంది. నూతన డిఎం ఎం రేవతి అభినందిస్తూ సత్కరించారు. డిఎం ఎం రేవతి మాట్లాడుతూ పుణ్యక్షేత్రానికి డిఎంగా పోస్టింగ్ రావడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యకమంలో రేవతి గణ సన్మానం చేసి దుస్వాలతో సత్కరించి కార్మికులు యూనియన్ నాయకులు, గ్యారేజ్ సిబ్బంది సభ్యులు పాల్గొన్నారు.

## చిన్ననాటి స్నేహితులను కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్

**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:**



ఎస్ఆర్ పురం మండలం పాపిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పూజాలి ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌తో కలిసి ఇంటర్మీడియట్ డిగ్రీ చదువుకున్నారు. శుక్రవారం పాపిరెడ్డి పల్లె గ్రామంలో పూజలి ఇంటికి ఎమ్మెల్యే డాక్టర్ థామస్ వెళ్లి పలకరించారు. చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పూజలి ఇంటి కుటుంబసభ్యు లతో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తపాల్గొన్నారు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## స్కిట్‌లో మెరుగైన వసతులు కల్పిస్తాం
### ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:** శ్రీకాళహస్తి స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో మెరుగైన వసతులు కల్పిస్తామని శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. అనంతపురం జేఎన్ టీయూ వైస్ ఛాన్సలర్ సుదర్శన్ రావుతో కలసి శుక్రవారం ఆయన స్కిట్ కళాశాలను పరిశీలించారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం తరగతులకు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నూతన లేబొరేటరీస్‌ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం అవుతాయని ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దన్నారు. మూడో విడత కౌన్సిలింగ్‌లో స్థానిక విద్యార్థులందరూ స్కిట్ కళాశాలను ఆప్షన్ కింద నమోదు చేసుకోవాలని కోరారు. హాస్టల్ వసతి కూడా కల్పిస్తున్నామన్నారు. మూడో విడత ఎంసెట్ కౌన్సిలింగ్లో వెబ్ ఆప్షన్ నమోదు ప్రక్రియలో విద్యార్థులకు అవసరమైన సలహాలు ఇవ్వాలని ఆధ్యాపకులకు సూచించారు. విద్యార్థులు స్కిట్ కళాశాలలో చేరడానికి ముందుకు రావాలని కోరారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా
## త్రుటిలో తప్పిన ప్రమాదం



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:** మండలంలోని ప్రముఖపుణ్యక్షేత్రం బోయ కొండ గంగమ్మ దేవస్థానంకు శుక్రవారం చిత్తూరు జిల్లా ఐరాల మండలం జంగాల పల్లి నుండి భక్తులు వివిధ వాహనాల్లో వచ్చారు. అమ్మవారి దర్శనం చేసుకున్న అనంతరం తీరుగు ప్రయాణంలో కుమార్ అనే వ్యక్తి, కొలింపల్లి క్రాస్ వద్దగల స్పీడ్ బ్రేకర్ పై ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టిన సంఘటనలో కుమార్ అనే వ్యక్తి గాయాల పాలుఅయ్యాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు అతివేగంగా ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ, పాదచాలను భయభ్రాం తులకు గురి చేస్తూ ద్విచక్ర వాహనం నడి పాడని వారు తెలియజేశారు. అందరూ చూస్తుండగానే స్పీడ్ బ్రేకర్ పైన స్పీడ్‌గా వెళ్ళి బోల్తాపడ్డాడని వారు తెలియజేశారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే అతని బంధువులకు సమాచారం అందించి అతనిని చౌడేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అతనిని చిత్తూరు ఆసుపత్రికి తరలించారు.

## యూరియా కోసం రైతులు పడిగాపులు




**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 12:** అన్నదాత సుఖీభవ అన్నారు పెద్దలు అయితే ఈ మాటగా తూతూ మంత్రంగా పనిచేస్తుంది. గాని నిజానికి ఒక రైతు కూడా బాగుపడిన దాఖలా లేదు.ఈ నేపథ్యంలో యూరియా సరఫరా తక్కువగా ఉండడంతో రైతులు ఉదయం నుండి సాయంకాలం ఆరు గంటల వరకు క్యూకట్టి కట్టి అలసి పోయారు. గత గత వారంలో సుమారు 81 టన్నుల యూరియా మండలానికి వచ్చింది. అది మొత్తం అయిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని త్వరగా యూరియా తెప్పిస్తామని వ్యవసాయాధికారి మోహన్ తెలియజేశారు.అందుకోసరమే మండలానికి యూరియా తెప్పించడం జరిగిందని ఆయన అన్నారు. ఐతే మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయ ఆవరణం లో, పుడమి ఫర్టిలైజర్ వద్ద, గ్రోమోర్ ఫర్టిలైజర్ వద్ద రైతులు ఉదయం ఏడుగంటల నుఝుడి పడిగాపులు గాసారు. ఉదయం నుండి తిండినీళ్ళు లేక అవస్థలు పడ్డారు. ఎన్ని అవస్థలు పడినా కనీసం ఒకటైనా యూరియా మూట దొరికినదని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఐతే వ్యవసాయ కార్యాలయం వద్ద సాయంత్రం ఆరున్నర గంటలైనా క్యూలైన్లు తగ్గలేదు. కావున సంబందిత అధికారులు వెంటనే మండల స్థాయిలో యూరియా ను స్టాకు ఉండేటట్లుగా చర్యలు తీసుకోవాలని రైతులు అన్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143